# బాలసంతులు

గ్రామంలో అందరినీ దీవిస్తూ మహా శివుని కీర్తిస్తూ యింటింటికి తిరిగే వారు బాలసంతాలు. వీరు బుడిగ జంగం కులములో ఒక తెగవారు.

సీతమ్మవారు లవకుశలకు వాల్మీకి ఆశ్రమంలో జన్మయిచ్చినపుడు వారిని చూచుటకు శ్రీరామచంద్రుని తమ్ములైన శ్రీలక్షణస్వామి వారు బాలసంత వేషధారణలో యవ్వరూ గుర్తించ కుండా గ్రామములు తిరిగి ధాన్యము, గుడ్డలు బిచ్చ మెత్తుకుంటూ చివరకు శ్రీ వాల్మీకి ఆశ్రమం చేరుకుంటారు. శ్రీ లక్ష్మణస్వామి లవకుశలను దీవించి వారికి తాను గ్రామాలలో సేకరించిన బట్టలను యిస్తారు.

బాలసంతులు కూడా తాము లక్ష్మణ స్వామి సాంప్రదాయాన్నే పాటిస్తామని చెబుతారు. అందువలన వారు చంటి పిల్లలను ఆశీర్వదిస్తారు. బాల సంతులు ధోతి, అంగరికి ధరించి విభూది, కుంకుమనుదుట ధరించి ఎర్రతలపాగ ధరిస్తారు. ఒక కావిడి భుజంపై పెట్టుకొని ఆ కావిడిలో పాతబట్టలు, బొంతలు పెట్టుకొని గ్రామగ్రామము తిరుగుతారు. ఈ కళాకారులు రాష్ట్రం అంతటా అక్కడక్కడ ఉన్నారు. రంగారెడ్డి జిల్లా లో ఎక్కువగా ఉన్నారు.

గ్రామంలో గ్రామ సంతుల రాకను గమనించగానే మంచిశకునముగా భావిస్తారు. ముఖ్యంగా వ్యవసాయపనులు మొదలుపెట్టునపుడు వారి రాక వలన తమ పంటలు బాగా పండుతాయని భావిస్తారు. వీరు జేగంట మరియు శంఖులను పాటలు పాడేటప్పడు ఉపయోగిస్తారు. ప్రతి యింటికి తిరిగి బిచ్చ మెత్తుకుంటారు. గర్భిణి స్త్రీలను సుఖ ప్రసవం కావాలని ఆశీర్వదిస్తారు. సంతానం లేని స్త్రీలకు ప్రత్యేకమయిన మందులు యిస్తారు.

ఈ విధంగా బాలసంతుల రాక గ్రామాలలో పురుషులకు, స్త్రీలకు, చిన్న పిల్లలకు ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది.